నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 7 మే 2024 | KHAMMAM

నేడు బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి నామినేషన్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం నల్లగొండ కలెక్టరేట్ వరకు ర్యాలీ, మీటింగ్

నల్లగొండ ప్రతినిధి, మే 6 (నమస్తే తెలంగాణ): వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజవర్గ శాసనమండలి ఉపఎన్నిక కోసం బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా నల్లగొండలోని లక్ష్మీగార్డెన్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ర్యాలీగా బయల్దేరుతుంది. నల్లగొండ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో 11 గంటలకు రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేయనున్నారు. అనంతరం స్థానిక ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో కార్యకర్తలతో సన్నాహక సమావేశంలో పాల్గొననున్నారు. కాగా, నామినేషన్ కార్యక్రమంలో నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, పట్టభద్రులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పట్టభద్రులంతా తనను గెలిపిస్తే శాసనమండలిలో ప్రభుత్వాన్ని ప్రశంసించే గొంతునవుతానని బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి తెలిపారు.

హామీలు నెరవేర్చకుండా.. ఓట్లెలా అడుగుతారు?

- జిల్లాలో నేను చేసిన అభివృద్ధిపై చర్చకు మీరు సిద్ధమా?
- అబద్ధాల కాంగ్రెస్.. అన్నదాతలను అరిగోస పెడుతోంది
- ముదిగొండ రోడ్‌షోలో బీఆర్ఎస్ అభ్యర్థి 'నామా'
- టూరిస్టు నాయకులతో ఒరిగేదేమీ లేదు: తాతా మధు
- 5 నెలల్లోనే అధోగతిపాలు చేశారు: లింగాల, కొండబాల

ముదిగొండ, మే 3: అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు.. వాటిని అమలు చేయకుండా ఈ ఎన్నికల్లో ఓట్లెలా అడుగుతారని ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ప్రశ్నించారు. అవాకులు చెవాకులు పేలుతున్న కాంగ్రెస్ పాలకులు.. జిల్లాలో తాను చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉండాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముదిగొండలో సోమవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. జిల్లాకు జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనుల కోసం అనేక నిధులు తెచ్చానని వివరించారు. ఓ రైతుబిడ్డగా, అన్ని వర్గాల కష్టాలు తెలిసిన వాడిగా పనిచేస్తున్నానని అన్నారు. ఈ ఎన్నికల్లో తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. సాగు మొదలుపెట్టే సమయం నుంచి పంటను విక్రయించే సమయం వరకూ అన్ని దశల్లోనూ గత కేసీఆర్ ప్రభుత్వం కర్షకులకు అండగా ఉంటూ వచ్చిందని గుర్తుచేశారు. కానీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను అరిగోసపెడుతోందని విమర్శించారు.

రోడ్‌షోలో మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు, చిత్రంలో తాతా మధు, లింగాల కమల్‌రాజు

టూరిస్టు నాయకులతో ఒరిగేదేమీ లేదు: తాతా మధు

ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు మాట్లాడుతూ.. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ పోటీ చేసిన వారితో జిల్లా ప్రజలకు ఒరిగేదేమీ లేదని విమర్శించారు. బయటి నుంచి వచ్చినవారు ఎప్పటికీ టూరిస్టులు మాత్రమే అవుతారని ఆరోపించారు. ఇక్కడ పోటీ చేయించడానికి కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులే దొరకలేదా? అని ప్రశ్నించారు. ముగ్గురు మంత్రులు ఉండి స్థానికులకు సీటు సాధించుకోలేక పోయారని విమర్శించారు. హామీల గురించి అడిగితే దేవుళ్లపై ఒట్లు పెడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

ఐదు నెలల్లోనే అధోగతి: కమల్‌రాజు

జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ.. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని అన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చిన ఈ ఐదు నెలల కాలంలోనే రాష్ట్రం అధోగతి పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో ఉండి పదవులు అనుభవించిన కొందరు నేతలు.. పొద్దుతిరుగుడు పువ్వులాగా నేడు అధికారం ఎటువైపు ఉంటే అటు వైపు తిరుగుతున్నారని విమర్శించారు.

అబద్ధాలతో నెట్టుకొస్తున్నారు: కొండబాల

టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. అదృష్టంకొద్దీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు.. హామీలు అమలు చేయకుండా కేవలం అబద్ధాలతోనే నెట్టుకొస్తున్నారని విమర్శించారు. ఇకపై ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు వినే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు బొమ్మెర రామ్మూర్తి, వాచేపల్లి లక్ష్మారెడ్డి, పసుపులేటి దుర్గ, మీగడ శ్రీనివాస్‌యాదవ్, మందరపు ఎర్ర వెంకన్న, తోట ధర్మారావు, గడ్డం వెంకటేశ్వర్లు, పచ్చ సీతారామయ్య, పోట్ల రవి, నీరుకొండ సతీశ్, బత్తుల వెంకట్రావు, పసుపులేటి వెంకట్, అమడాల జక్కర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్‌షోకు హాజరైన పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు

ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- 'నామా'ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే కందాల

కూసుమంచి, మే 6 : తెలంగాణ ప్రజల ఆకాంక్షతో ఏర్పడిన బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుకుపోతుందని, ఈ నెల 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కోరారు. సోమవారం కూసుమంచి మండలంలో నామా విజయాన్ని కాంక్షిస్తూ మునిగేపల్లి, నేలపట్ల, కోక్యాతండా, లోక్యాతండాల్లో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం గట్టుసింగారంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ నామా నాగేశ్వరరావు మంచి పార్లమెంటేరియన్‌గా తెలంగాణ హక్కుల కోసం పోరాటం చేసిన వ్యక్తి అని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు.

పాలేరులో అత్యధిక ఓట్లు రావాలి: కందాల

పాలేరు నియోజకవర్గంలో గత పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలోనే అత్యధికంగా ఓట్లు వచ్చాయని, ఈసారి కూడా నామాకు అత్యధికంగా ఓట్లు వచ్చే విధంగా ప్రతిఒక్కరూ పని చేయాలని మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కోరారు. ప్రతిఒక్కరూ ఈ వారంరోజులు కష్టపడి నామాకు ఓట్లు వేయించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాళ్లూరి జీవన్, ఇంటూరి శేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు వేముల వీరయ్య, ఎంపీటీసీలు తిరుపతమ్మ, అలీ, వెల్లపల్లి కోటేశ్వరరావు, బారి మల్సూర్, వీరబాబు పాల్గొన్నారు.

హామీల అమలు చేతగాక.. బీఆర్ఎస్‌పై బురద జల్లుతారా?

ఏడు మండలాలను ఆంధ్రాలో కలిపిన పాపం 'బలరాం'దే కదా?

ఢిల్లీ గులాములకు తెలంగాణ రాష్ట్రాన్ని మళ్లీ తాకట్టు పెడతారా?

బూత్ కమిటీల సమావేశంలో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా

బూత్ కమిటీల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

దుమ్ముగూడెం, మే 6: హామీల అమలు చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం.. గత కేసీఆర్ ప్రభుత్వంపై బురద జల్లుతోందని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విమర్శించారు. మండలంలోని మూరాయిగూడెంలో సోమవారం నిర్వహించిన తూరుబాక, కొత్తూరు బీఆర్ఎస్ బూత్ కమిటీ సమావేశంలో ముఖ్య కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అబద్ధపు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిందని విమర్శించారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో తెలంగాణలో ఏ గ్రామానికి వెళ్లినా కనిపిస్తుందని స్పష్టం చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను కాంగ్రెస్ మళ్లీ ఢిల్లీ గులాములకు తాకట్టు పెట్టిందని ఆరోపించారు. అప్పటి మహబూబాబాద్ ఎంపీ, ఇప్పటి కాంగ్రెస్ అభ్యర్థి అయిన బలరాంనాయక్.. అప్పుడు కేంద్రమంత్రిగా ఉండి కూడా తన నియోజకవర్గంలోని భద్రాచలం, పినపాక అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉన్న ఏడు మండలాలను ఆంధ్రాలో కలిపిన పాపాన్ని మూటగట్టుకున్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు పేరుతో అప్పటి కేంద్ర మంత్రి జైరామ్ రమేశ్ అధ్యక్షతన ఏర్పడిన ఆర్డినెన్స్ కమిటీ.. ఇక్కడి ఏడు మండలాలను అన్యాయంగా ఆంధ్రాలో కలిపిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మానె రామకృష్ణ, సాగి శ్రీనివాస్, రాజు, అన్నె సత్యనారాయణ మూర్తి, కణితి రాముడు, రేసు లక్ష్మి, తునికి కామేశ్, అపక వీర్రాజు, సోడి కొండయ్య, కటిబోయిన వెంకటేశ్వర్లు, బొల్లి వెంకట్రావ్, కొత్త మల్లేశ్, అపక శ్రీను, వెంకటేశ్, కుంజా నాగేశ్వరరావు, పోడియం సుబ్బారావు, పాయం వెంకటేశ్వర్లు, కుర్సం రాజు, కారం వెంకటేశ్, సాగి వర్మ, కల్లూరి కామేశ్, మర్మం గంగరాజు, జీలకర గంగరాజు, కట్టం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు

- రైతుబంధు రాలేదు.. రుణమాఫీ కాలేదు.. తులం బంగారం అందలేదు..
- సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా చెప్పిన మాటలనే అమలుచేయలేదు..
- హామీలు నెరవేర్చేదాకా పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పోరాటాలు చేస్తుంది..
- ఖమ్మం, 'పాలెం' ప్రచారంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం నగరంలో రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం/ రఘునాథపాలెం, మే 6: కాంగ్రెస్‌వన్నీ మోసపూరిత వాగ్దానాలేనని తేలిపోయిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా తాను చెప్పిన మాటలను అమలుచేయకపోవడమే ఇందుకు నిదర్శనమని స్పష్టం చేశారు. ఖమ్మం లోక్‌సభ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మం నగరం, రఘునాథపాలెం మండలంలో సోమవారం ఆయన రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆచరణ సాధ్యం కాని 420 హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని అమలుచేయలేక మల్లగుల్లాలు పడుతోందని విమర్శించారు. రూ.15 వేల రైతుభరోసా రాలేదని, రైతులకు రుణమాఫీ కాలేదని, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం అందలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా పొరపాటున వెళ్లి బ్యాంకుల్లో రూ.2 లక్షల పంట రుణం తీసుకొని ఉంటే ఏమైఉండేదో రైతులు అర్థం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో ఆ వాగ్దానాలు అమలు చేయించేందుకు బీఆర్ఎస్ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. ఇందుకోసం బీఆర్ఎస్‌ను ప్రజలు బలపర్చాలని కోరారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

రఘునాథపాలెంలో ఉపాధి హామీ కూలీల వద్ద ఓట్లు అభ్యర్థిస్తున్న అజయ్‌కుమార్

తులం బంగారం తుస్సు..

ఆర్భాటంగా హామీలిచ్చిన కాంగ్రెస్ నేతలు.. అధికారం చేపట్టాక వాటిని అటకెక్కించారని అజయ్‌కుమార్ విమర్శించారు. ఎంతో గొప్పగా చెప్పిన తులం బంగారం తుస్సుమన్నదని, కల్యాణలక్ష్మి కస్సుమన్నదని ఎద్దేవాచేశారు. అధికారం చేపట్టి ఐదు నెలలు గడుస్తున్నా రూ.500కి గ్యాస్ ఇవ్వలేదని, మహిళలకు రూ.2500 జాడలేదని విమర్శించారు. గడిచిన పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఖమ్మం నగరంలో మళ్లీ మంచినీటి కష్టాలు తెచ్చిన చరిత్ర ఈ కాంగ్రెస్ మరోసారి మూటగట్టుకుందని దుయ్యబట్టారు. అందుకని ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పగడాల నాగరాజు, బుర్రి వెంకట్‌కుమార్, పగడాల శ్రీవిద్య, బుర్రి వినయ్‌కుమార్, శీలంశెట్టి వీరభద్రం, తాజుద్దీన్, సూత్రాల శ్రీను, రాములు, సురేశ్, సైదా, అజ్మీరా వీరూనాయక్, మద్దినేని వెంకటరమణ, కొంటెముక్కల వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి మోహన్‌రావు, వల్లభనేని వెంకటప్పారావు, నరేశ్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడేందుకు.. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

- ఉపాధి హామీ కూలీల సమావేశంలో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, మే 6: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడేందుకు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. ఆయా హామీలను అమలుచేయించేందుకే ప్రజల పక్షాన ఆయా ప్రభుత్వాలపై బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. సత్తుపల్లి మండలంలో సోమవారం పర్యటించిన ఆయన.. ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ వివిధ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో గల ఉపాధి హామీ కూలీలను కలుసుకొని వారితో మాట్లాడారు. పార్లమెంట్‌లో తెలంగాణను వాణిని వినిపించేందుకు బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలిపించుకోవాలని, అందుకోసం కారు గుర్తుపై ఓటు వేసి నామాకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఆయా హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసేంత వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు.

'నామా'కు అత్యధిక మెజార్టీ ఇవ్వండి: సండ్ర

సత్తుపల్లి, మే 6: కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. పార్లమెంటు ఎన్నికల్లో ఖమ్మం స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ.. సత్తుపల్లి మండలం కిష్టారం, గౌరిగూడెం, కొత్తూరు, సదాశివునిపాలెం గ్రామాల్లో సండ్ర సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కూసంపుడి రామారావు, యాగంటి శంకర్‌రావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మందపాటి చెన్నారెడ్డి, మందపాటి ప్రసాద్‌రెడ్డి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

బ్యాలెట్ యూనిట్ల పొందికలో జాగ్రత్తలు వహించాలి

మాక్‌పోలింగ్ పరిశీలనలో ఖమ్మం కలెక్టర్ గౌతమ్

సత్తుపల్లి, మే 6: ఈవీఎం యంత్రాల కమిషనింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. సత్తుపల్లి జ్యోతినిలయంలో చేపడుతున్న సత్తుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్ల కమిషనింగ్ ప్రక్రియను, మాక్‌పోల్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. సత్తుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన 294 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల కమిషనింగ్‌ను చేపడుతున్నట్లు తెలిపారు. బ్యాలెట్ యూనిట్ల పొందికలో జాగ్రత్తలు వహించాలని, సంబంధిత సీలింగ్‌లు చేయాలని సూచించారు. అనంతరం సత్తుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం, ఐకేపీ బిల్డింగ్‌లలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి నిర్వహిస్తున్న రిజిస్టర్లు పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియగా చేపడుతున్న తీరును పరిశీలించి ఇంత వరకు ఎంతమంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారని అడిగి తెలుసుకున్నారు. భద్రతాపరమైన ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

డబ్బు, మద్యం రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలి

ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రలోభాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. మండలంలోని జంగారం గ్రామంలోని మేడిశెట్టివారి పాలెం క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును సోమవారం ఆయన తనిఖీ చేశారు. వాహన తనిఖీ రిజిస్టర్‌ను పరిశీలించి 'ఏయే రకాల వాహనాలు తనిఖీ చేస్తున్నారు? ఇంతవరకు చెక్‌పోస్టు తనిఖీల్లో పట్టుబడిన నగదు, మద్యం, ఇతర వివరాలు ఏమిటి?' అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వాహనాలు, రాజకీయ పార్టీల వాహనాలు, అన్ని రకాల వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ట, కల్లూరు ఆర్డీవో రాజేందర్, ఏసీపీ రఘు, ఆర్డీవో కార్యాలయ అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఖర్చులన్నీ నమోదు చేయాలి

భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల

ఎన్నికల అకౌంటింగ్ ఆఫీస్‌ను పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ భద్రాచలం, మే 6: ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులన్నీ నమోదు చేయాలని భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. భద్రాచలం ఆర్డీవో కార్యాలయంలోని ఎన్నికల అకౌంటింగ్ టీం ఆఫీస్‌ను సోమవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు సీజ్ చేసిన నగదు, అందులో తిరిగి ఇచ్చేసిన మొత్తం తదితర వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. అభ్యర్థుల ర్యాలీలు, ఖర్చుల వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. ప్రచారానికి అనుమతించిన వాహనాలకు మించి ఉన్నట్లయితే.. మొత్తం అనుమతినే రద్దు చేయాలని ఆదేశించారు. ఒక అభ్యర్థి అనుమతి తీసుకున్న వాహనాన్ని వేరొక అభ్యర్థి వినియోగించరాదని స్పష్టం చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో వచ్చే ఎన్నికల ప్రకటనలను వాటి రేట్ల ఆధారంగా అభ్యర్థి ఖర్చులో జమ చేయాలని చెప్పారు. అన్ని చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను నిశితంగా నిర్వహించాలన్నారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో అకౌంటింగ్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్, వీఎస్‌టీ, ఎస్ఎస్‌టీ క్రియాశీలకంగా వ్యవహరించాలని అన్నారు. సెలవు దినాల్లో కూడా నిఘా పెంచాలన్నారు. స్టాటిక్ సర్వేయలెన్స్ అధికారులు ప్రతి వాహనాన్ని వీడియోగ్రఫీతో తనిఖీ చేయాలన్నారు. వాహనాల తనిఖీ, జప్తు చేసిన నగదు, ఇతర సమాచారానికి సంబంధించిన వివరాలను నిర్దిష్ట నమూనాలో సంబంధిత అధికారుల ద్వారా రోజూ పంపించాలన్నారు. జప్తు చేసిన వాటికి రసీదు ఇవ్వాలన్నారు. రాత్రి సమయాల్లో పలు జాగ్రత్తలతో తనిఖీలు నిర్వహించాలన్నారు. భద్రాచలం ఏఆర్‌వో/ఆర్డీవో దామోదరరావు, అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ వేల్పుల శ్రీనివాస్, అకౌంటింగ్ టీం సభ్యుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఐదో రోజు 16 నామినేషన్లు

నీలగిరి, మే 6: వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికకు ఐదో రోజు సోమవారం 13 మంది అభ్యర్థులు 16 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. బీఆర్ఎస్ నుంచి ఆనుగుల రాకేశ్ ఒక సెట్, టీడీపీ నుంచి ముండ్ర మల్లికార్జునరావు రెండు సెట్లు, ధర్మ సమాజ్ పార్టీ నుంచి బరిగల దుర్గాప్రసాద్ మహారాజ్ ఒక సెట్, నేషనల్ నవక్రాంతి పార్టీ నుంచి కర్ని రవి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థులుగా పులిపాక సుజాత రెండు సెట్లు, తాడిశెట్టి క్రాంతికుమార్ రెండు సెట్లు, చీదల్ల వెంకట సాంబశివరావు, చీదల్ల ఉమామహేశ్వరి, అయితగోని రాఘవేంద్ర, భక్కా జడ్సన్, బుగ్గ శ్రీకాంత్, పాలకూరి అశోక్‌కుమార్, దేశగాని సాంబశివరావు ఒక్కో సెట్ నామినేషన్లను దాఖలు చేశారు. వీరు రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందనతోపాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ములుగు జిల్లా అదనపు కలెక్టర్ జి.మహేందర్‌కు నామినేషన్లను సమర్పించారు.